# స్థిత ప్రజ్ఞత

"శ్రీకర్! నా పర్స్ ఎవరో కొట్టేసినట్టున్నారు".

"నిజంగానా మిలన్? ఎప్పుడు, ఎక్కడ కొట్టేశారంటావు?

"మనం ఇందాక ముంబాదేవి మందిరంలో ఉన్నప్పుడు ఎవడో తన హస్త లాఘవం చూపించినట్టున్నాడు."

"అందులో ఎంతమొత్తం ఉందేమిటి?" నా శ్రీమతి ఉత్కంఠ.

"అయిదారువేల రూపాయలు, రెండు క్రెడిట్ కార్డులు, కొన్ని ముఖ్యమైన పత్రాలు ఉండాలి."

మిలన్ శ్రీమతి కాజల్‌బేన్ కళ్ళ నిండా నిళ్ళు.

"కష్టార్జితం ఇలా పోవడం బాధగా ఉందన్నయ్యగారూ!" అని ఒకటే ఏడుపు.

నాకూ బాధగానే ఉంది. నా అతిధిగా ముంబయి విహారానికి వచ్చిన నా మిత్రుని పర్స్‌పోవడం, కాస్త అవమానంగా కూడా ఉంది. ఆ మాటంటే

"నువ్వెందుకు బాధపడుతావు శ్రీకర్! నా అజాగ్రత్తో, వాడెవడికో గత జన్మలో బాకీపడి ఉన్నానో, ఈ జన్మలో తీర్చేసుకున్నాను. ఇక క్రెడిట్ కార్డులు దురుపయోగం

కాకుండా చూడాలి. సెల్‌ఫోన్‌లో మెసేజ్ పంపాను కాని, ఇంటికెళ్ళి ఇంటర్నెట్ ద్వారా కూడా మెసేజ్ పంపాలి."

"అంత డబ్బు పోయినా నిబ్బరంగా ఎలా ఉండగలుగుతున్నావ్?

"ప్రతి విషయంలో ఆందోళన చెందుతూ వాపోయే బదులు మన అదృష్టం అంతేలే అనుకుని, ఇకముందు చేయబోయే పనుల గురించి ఆలోచించాలి. జరిగిందానికి కుళ్ళిపోతే మన బ్లడ్ ప్రెషర్, షుగర్ లెవెల్ పెరుగుతుందే తప్ప వేరే ప్రయోజనంలేదు." మిలన్‌లో అదే నిర్లిప్తత.

"ఈయనెప్పుడూ ఇంతే అన్నయ్యగారూ ఏదీ సీరియస్‌గా తీసుకోరు. ఏది, ఎప్పుడు, ఎలా జరగాల్సి ఉందో అది, అప్పుడు, అలా జరుగుతుందని మెట్టవేదాంతం వల్లిస్తారు." భర్తమీద చాడీలు చెప్పే అవకాశం వదులుకోలేదు కాజల్‌బేన్.

చిరునవ్వే మిలన్ సంజాయిషీ !

మిలన్‌వాళ్ళు హైద్రాబాద్‌లో స్థిరపడ్డ మార్వాడీలు. వారు ఇంట్లో కూడా తెలుగే మాట్లాడతారు. ఉద్యోగరీత్యా నేను హైదరాబాద్‌లో ఉన్నప్పటి పరిచయం స్నేహంగా మారి, గత పదేళ్ళుగా ఇలాగే కొనసాగుతూంది. మిలన్ ముంబయి సందర్శన జయప్రదం కావడానికి మా శాయశక్తులా ప్రయత్నించాము. పిక్‌పాకెట్ సంఘటన మినహా మేమంతా వారి రాకబాగా ఎంజాయ్ చేశాము.

వారికి వీడ్కోలు చెప్పడానికి ఛత్రపతి శివాజి టర్మినస్ వెళ్లాము. మేముండే ముంబయి శివార్ల నుండి పెందలాడే బయలుదేరి, రైలు కదిలే సమయానికి గంట ముందే స్టేషన్ చేరుకున్నాము. అప్పటికింకా రైలు ప్లాట్‌ఫాం పైకి రానందున సామాను రిజర్వేషన్ బోగీ వచ్చే చోటులో పెట్టి కబుర్లలో పడ్డాము. తీయని స్నేహంలోని ఆనందం ఆస్వాదించాము. రైలు రాగానే హడావుడిగా కంపార్ట్‌మెంట్‌లో చొరబడ్డాం. సామానంతా సర్దింతర్వాత చూస్తే మిలన్ వాళ్ళ నాలుగేళ్ళ అబ్బాయి కనిపించలేదు. మా మనసు మనసుల్లో లేదు. కంపార్ట్‌మెంట్‌లో, ప్లాట్‌ఫాంపై వెతికాము, అబ్బాయి జాడ లేదు. నేను ట్రైన్ దిగి ఓసారి ప్లాట్ ఫాం ఆ చివర నుండి ఈ చివర గాలించాను. ఒక బోగీ నుండి ఇంకో బోగీకి లోపలినుంచి పోయే వసతి ఉండడంతో, అన్ని కంపార్ట్‌మెంట్లూ చూశాను. అబ్బాయి పత్తాలేదు. నా బ్లడ్‌ప్రెషర్ పెరుగుతోంది. కాజల్‌బేన్ ఏడుపందుకుంది. నా శ్రీమతి మోహంలోనూ ఆందోళన. నేను పట్టుపట్టడం వలన ముంబయి వచ్చిన మిలన్ కుటుంబానికి ఈ ఆపదేమిటి. మాకు ఈ టెన్షనేమిటి శ్రీ వేంకటేశ్వరస్వామిని స్మరించుకుని స్టేషన్ మాష్టర్ కార్యాలయం వైపు అడుగులు

వేశాను. అక్కడి నుండి అబ్బాయి వివరాలతో మైక్‌లో ప్రకటన చేయించాను. పది నిమిషాలు వేచి చూశాను. అబ్బాయి దొరకలేదు. మిలన్‌తో సెల్‌లో మాట్లాడాను. పరిస్థితిలో మార్పులేదు. రైలుకు సమయమవుతుండంతో బోగీవైపు నడిచాను. కాజల్‌బేన్ ఏడుస్తూనే ఉంది. మిలన్ తాపీగా కూర్చున్నాడు.

"ఏమిటిది మిలన్? మీ అబ్బాయి తప్పిపోతే నీకు చీమకుట్టినట్టయినా లేదా? కాజల్‌బేన్ మొహం చూడు ఎంత బాధపడ్తుందో? ఎంతయినా అమ్మ కదా? అలా చేతులు ముడచుకుని ఉంటేసరా? ఏదో ఒకటి చేయి."

"శ్రీకర్! నీ ప్రయత్నాలేవో చేస్తూనే ఉన్నావు కదా? అబ్బాయి ఈ రైల్లోగాని ఉంటే, కనుక్కోవడానికి నేనున్నాను. బయట ఉంటే చూడడానికి నువ్వున్నావు. ఇంతలోనే అబ్బాయి ఎక్కడా మాయంకాలేదుకదా? మనమంతా కంగారుపడి ఇంతకన్నా ఎక్కువేమైనా చేయగలమా?" మిలన్‌లో అదే ప్రశాంతత. వీడితో కాజల్‌బేన్ ఎలా వేగుతోందో ?

రైలు కదలడానికింకా రెండు నిమిషాలే ఉన్నాయి. మేము ప్లాట్‌ఫాంపైకి దిగాము దూరంగా దృష్టి సారించాను. ఓ పోర్టరు, ఓ చిన్న అబ్బాయి, మా బోగీవైపే వస్తున్నారు.

"ఆ అబ్బాయి? మిలన్ వాళ్ళ అబ్బాయే కదా" శ్రీమతితో అన్నాను.

"అలాగే కనిపిస్తున్నాడండీ" శ్రీమతి కూడా వంతపాడింది. వాళ్లు దగ్గరిదాకా వచ్చారు.

"హమ్మయ్య! తప్పిపోయిన అబ్బాయి దొరికాడు! వాణ్ణి ఎక్కించగానే రైలు కదిలింది. మా ప్రాణాలు కుదుటపడ్డాయి. కిటికీ నుండే వీడ్కోలు పలికాము. ఆ పోర్టరు చేతిలో ఓ వంద కాయితం ఉంచి ధన్యవాదాలు తెలిపాను.

ఇంటికి తిరిగి వస్తుంటే నాలో ఒకటే ఆలోచన. రిటైర్‌మెంట్‌కి దగ్గరలో ఉన్న నాకు హార్ట్ ట్రబుల్, షుగర్, బి.పి. అన్నీ నేనంటే నేనని పోటీ పడుతూ ఉన్నాయి. నా సమవయస్కుడైన మిలన్ మాత్రం రాయిలా ఉన్నాడు. అతని ఆరోగ్య రహస్యం అతని గుండె నిబ్బరమేనా? అది నిర్లిప్తతా? ఎస్కేపిజమా? స్థితప్రజ్ఞతా? ఇంట్లో అడుగుపెట్టినా నా ఆలోచన తెగలేదు. ఆ రాత్రినాకు శివరాత్రే అయింది.

నేటినిజం స్వాతంత్ర్య దినోత్సవ సంచిక - 2008